## క్లుప్తంగా

### ఘనంగా ప్రారంభమైన గ్రామదేవతల పండగ

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ గ్రామ దేవతలు పోలమాంబ, ఎర్నమ్మ, సత్తమ్మ తల్లి అమ్మవార్ల మహోత్సవం సోమవారం ఘనంగా ప్రారంభమైంది. 9 రోజుల పాటు నిర్వహించనున్న ఈ పండగలో ప్రతి రోజూ సాయంత్రం ఆధ్యాత్మిక,సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. అమ్మవార్లకు పసుపు, కుంకుమ సమర్పించేందుకు గుడ్లవానిపాలెం, సాగర్ నగర్, రుషికొండ ప్రాంతాల నుంచి మహిళలు పెద్ద ఎత్తున తరలివస్తారు. ఈ నెల 16న అనుపు కార్యక్రమంతో ఉత్సవం ముగుస్తుంది.

### పారిశుధ్య కార్మికులకు కొబ్బరి నూనె పంపిణీ



పారిశుధ్య కార్మికులకు కొబ్బరినూనె సీసాలు అందిస్తున్న కార్పొరేటర్ కొండబాబు

కొమ్మాది: జీవీఎంసీ సమకూర్చిన కొబ్బరి నూనె సీసాలు, సబ్బులను 44 మంది పారిశుధ్య కార్మికులకు 4వ వార్డు కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు సోమవారం పంపిణీ చేశారు. చేపలుప్పాడ సచివాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో కొండబాబు మాట్లాడుతూ కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో కూడా పారిశుధ్య కార్మికులు ఎనలేని సేవలందించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్లు బడే అమ్మోరు, పైడిరాజు, హేమలత, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

### వైఎస్సార్‌సీపీ నాయకుడి కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కొమ్మాది: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన వైఎస్సార్‌సీపీ బూత్ కన్వీనర్ గండి నొల్లయ్య కుటుంబానికి 6వ వార్డు కార్పొరేటర్ ముత్తంశెట్టి లక్ష్మీ ప్రియాంక, స్థానిక నాయకులు ఆర్థికసాయం చేశారు. సేవానగర్‌లో నివాసముంటున్న నొల్లయ్య భార్య సుమతికి రూ. 25 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు బొట్టా అప్పలరాజు, స్థానిక నాయకులు గుంటుబోయిన సంజీవ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### పాలిసెట్‌కు ఏర్పాట్లు పూర్తి

భీమునిపట్నం: పాలిసెట్‌కు అవసరమైన ఏర్పట్లు చేసినట్టు ప్రభుత్వ మహిళ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.మురళీకృష్ణ తెలిపారు. ఇక్కడ ఆరు కేంద్రాల్లో బుధవారం జరిగే ఈ పరీక్షకు 950 మంది విద్యార్థులు హాజరు కానున్నారని, ఉదయం 11 గంటల నుంచి 1గంట వరకు పరీక్ష జరుగుతుందని తెలిపారు.

### అవంతి విద్యార్థుల రక్తదానం



రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న అవంతి విద్యాసంస్థల డైరెక్టర్ చంద్రశేఖర్

తగరపువలస: చెరకుపల్లి అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం ఎన్ఎస్ఎస్ యూనిట్, లైఫ్ షేర్ బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో 107 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. రక్తదానం ప్రాముఖ్యతను డాక్టర్ బి.మురళీకృష్ణ విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా రక్తదాతలకు డైరెక్టర్ ఆకుల చంద్రశేఖర్ సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వి.సుమన, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ షేక్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.



# ఆహ్లాదకరంగా రుద్రభూమి

ఎటు చూసినా గోతులు, తుప్పలతో అస్తవ్యస్తంగా ఉండే శ్మశానవాటిక ధార్మిక, స్వచ్ఛంద సంస్థల కారణంగా ఆహ్లాదకరంగా మారింది. సౌకర్యాలు సమకూరాయి. తాజాగా మరిన్ని వసతులు, శివుని విగ్రహం ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు చేశారు.

- చిట్టివలస శ్మశానవాటికలో వసతులు కల్పించిన ధార్మిక, స్వచ్ఛంద సంస్థలు
- మరిన్ని సౌకర్యాల కల్పనకు ప్రతిపాదనలు



చిట్టివలస సత్యసాయి సేవా సమితి నిర్మించిన శాంతిస్థల్



చిట్టివలస శ్మశానవాటిక

తగరపువలస: చిట్టివలస గోస్తనీనది తీరం వద్ద గల శ్మశానవాటికలో మృతదేహాలకు అంతిమసంస్కారాలు నిర్వహించాలంటే సమస్యగా ఉండేది. కనీసం అడుగు పెట్టే సాహసం కూడా చేయలేక చాలావరకు మృతుల బంధువులు అల్లంత దూరాన ఉండిపోయేవారు. తుమ్మచెట్లు, పొదల కారణంగా విష పురుగులతో నిండిపోయి ఉండేది. ఎక్కడ పడితే అక్కడ ఖననం, దహనం నిర్వహించేవారు. మృతులకు చెందిన వస్తువులతో ఇక్కడి వాతావరణం జుగుప్సాకరంగా ఉండేది. వర్షం పడితే అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి. ఎండకాస్తే నిలువ నీడలేక ఇబ్బంది పడేవారు.

**పుష్కర కాలంలో ఎన్నో మార్పులు..**

రాష్ట్రంలోనే తొలిసారిగా చిట్టివలస సత్యసాయి సేవాసంస్థ దాతల సాయంతో రూ.5 లక్షల వ్యయంతో మృతదేహాలను దహనం చేసేందుకు ఇక్కడ శాంతిస్థల్ నిర్మించింది. 2014లో జీవీఎంసీ రూ.36.90 లక్షలతో వసతులు కల్పనకు ముందుకు వచ్చింది. అప్పటి టీడీపీ నాయకుల అవినీతి కారణంగా పనులు జరగలేదు.

రూ.19.15 లక్షలు ఖర్చు చూపించి రూ.17.75 లక్షలు వాటాలు వేసుకుని నాణ్యత లేని పనులు చేసి మమ అనిపించారని ఆరోపణలు ఉన్నాయి. ఆ సమయంలో ప్రహారీ పూర్తి చేయకపోవడమే కాకుండా షెడ్లు, బోరుబావి, గేట్లు తదితర వసతులు కల్పించకుండా అవినీతికి పాల్పడ్డారు. ఈ ఏడాది చిట్టివలస ఫ్రెండ్స్ హెల్పింగ్ హేండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రూ.2 లక్షలతో షెడ్డు నిర్మించింది. ఇక్కడ శివుని విగ్రహం ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు చేస్తున్నారు. ఇప్పుడు దివీస్ లేబరేటరీ ప్రతినిధులు రూ.20 లక్షలతో శాంతిస్థల్ చుట్టూ ప్రహారీ, శ్మశానవాటికలో జంగిల్ క్లియరెన్స్, షెడ్డు, మిగిలిన ప్రహారీ పూర్తి చేయడం మొదలు పెట్టారు. అంతేకాకుండా జీవీఎంసీ ఒకటోవార్డు కార్పొరేటర్ పలుమార్లు తన సొంత సొమ్ముతో జంగిల్ క్లియరెన్స్ చేయడంతో పాటు, హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేశారు. మరిన్ని వసతుల కల్పనకు స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకు రావాలని స్థానికులు కోరుతున్నారు.



ఫ్రెండ్స్ అసోసియేషన్ నిర్మించిన షెడ్డు పక్కన దివీస్ లేబరేటరీ నిర్మించిన మరో షెడ్డు

# క్రీడాకారులకు అన్ని విధాలా ప్రోత్సాహం



క్రికెట్ స్టేడియం వద్ద అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

- విగ్రహ ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

పీఎం పాలెం: రాష్ట్రంలోని ప్రతిభావంతులైన క్రీడాకారులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తున్నారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. ఈ నెల 11న వైఎస్సార్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం వద్ద దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆవిష్కరించనున్న నేపథ్యంలో సోమవారం సాయంత్రం స్టేడియం వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ముత్తంశెట్టి మాట్లాడుతూ ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆ రోజు గ్రామీణ క్రీడాకారులతో సీఎం స్వయంగా మాట్లాడనున్నారని చెప్పారు. విశాఖ ఆర్‌డీవో భాస్కర రెడ్డి మాట్లాడుతూ సీఎం పర్యటన విజయవంతానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఏసీఏ కార్యదర్శి ఎస్.ఆర్.గోపీనాథ్‌రెడ్డి, విశాఖ నార్త్ ఏసీపీ ఎం.శివరామిరెడ్డి, సీఐలు రామకృష్ణ, సాయి, 8వ వార్డు కార్పొరేటర్ లొడగల అప్పారావు, 5, 6, 7 వార్డుల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు పోతిన హనుమంతరావు, బొట్ట అప్పలరాజు, పోతిన శ్రీనివాసరావు, పార్టీ నాయకులు గాదె రోశిరెడ్డి, జె.ఎస్.రెడ్డి, కృష్ణ మూర్తి పాత్రుడు, పిళ్లా సూరిబాబు, కుడితి రామారావు, పోతిన యల్లాజీ, జామి శివకుమార్ పాల్గొన్నారు.

### కృష్ణాపురం సచివాలయం తనిఖీ

పద్మనాభం: మండలంలోని కృష్ణాపురం సచివాలయాన్ని ఎంపీడీవో ఎం.విజయ్‌కుమార్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం నిర్మాణంలో ఉన్న సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రం, జగనన్న కాలనీ ఇళ్లను పరిశీలించారు.



జగనన్న కాలనీని పరిశీలిస్తున్న ఎంపీడీవో

## అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు సత్కారం



కొణతాల గోపికశ్రీని అభినందిస్తున్న తాటితూరు జెడ్పీహైస్కూల్ ఉపాధ్యాయులు



నేర్లేరులో సన్మానిస్తున్న నాయకులు

తగరపువలస: పదవ తరగతి పరీక్షల్లో అధిక మార్కులు సాధించిన భీమిలి మండలం తాటితూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులను ఉపాధ్యాయులు సత్కరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు డి.శ్రీనివాసరావు మాట్లాడుతూ కొణతాల గోపికశ్రీ 560 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. 510 మార్కులతో గారి డీష్మ, 507 మార్కులతో పి.శ్రీరామ్ రెండు, మూడు స్థానాలు సాధించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు టి.ఎస్.వి.ప్రసాదరావు, టి.ఎస్.సత్యనారాయణ, జమ్ము అప్పలనాయుడు, ఊడికల శ్రీనివాసరావు, పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురం: పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన మండలంలోని నేర్లేరు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థులకు పలువురు నాయకులు ప్రోత్సాహకాలు అందజేసి సత్కరించారు. నమ్మి భారతి అనే విద్యార్థిని 588 మార్కులు సాధించి మూడు మండలాల్లో గల కస్తూర్బా పాఠశాలల విద్యార్థుల్లో టాపర్‌గా నిలిచింది. మరో నలుగురు ఉత్తమ మార్కులు సాధించారు. నమ్మి భారతికి రూ.1500, మిగతా నలుగురు విద్యార్థులకు రూ.500 చొప్పున నగదు బహుమతి, పుస్తకాలు, స్టేషనరీని అందజేశారు. సర్పంచ్ లొడగల రాజేశ్వరి, సహకార సంఘం అధ్యక్షుడు పాండ్రింకి అప్పారావు, మాజీ సర్పంచ్‌లు బంక సూర్యనారాయణ, లొడగల రమణ, మాజీ ఎంపీటీసీ సభ్యుడు లొడగల వెంకటరావు, గుడిలోవ దేవస్థానం మాజీ చైర్మన్ బంక కృష్ణంనాయుడు, రౌతు అప్పలరాజు తదితరులు విద్యార్థులను, ప్రత్యేకాధికారి చంద్రకళను ఘనంగా సత్కరించారు.

### తెలుగు అధ్యాపకురాలికి అవార్డు



అవార్డు పొందిన జ్యోతి

భీమునిపట్నం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ సీహెచ్.జ్యోతి ది బెస్ట ఉమెన్ ఫ్యాకల్టీ అవార్డును పొందారు. చెన్నై గ్రాబ్స్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్‌వారు ప్రతి సంవత్సరం వివిధ రంగాల్లో నైపుణ్యం ప్రదర్శించేవారికి ఈ అవార్డులు ఇస్తారు. ఈ సంవత్సరం జ్యోతికి అవార్డు ప్రదానం చేశారు. జ్యోతిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల, ఇతర అధ్యాపకులు సోమవారం జ్యోతిని అభినందించారు.

### నిత్యావసర సరకుల పంపిణీ



దుర్గకు నిత్యావసర సరకులు అందజేస్తున్న టీచర్స్ హెల్ప్ సభ్యులు

భీమునిపట్నం: టీచర్స్ హెల్ప్ గ్రూప్ ఆధ్వర్యంలో సోమవారం పేద కుటుంబానికి నిత్యావసర సరకులు అందజేశారు. కృష్ణాకాలనీ వద్ద ఉంటున్న కొల్లూరు దుర్గ పేదరికంతోపాటు, అనారోగ్యంగా బాధపడుతున్నారు. ఈమెకు నెలకు సరిపడా సరకులను గ్రూప్ అధ్యక్షురాలు మానాపురం రమాదేవి, ప్రధాన కార్యదర్శి గరుకు శ్యామలాంబ అందజేశారు. ఈ కార్యక్రమంలో మరగడ రామకృష్ణ పాల్గొన్నారు.

## పాఠ్యపుస్తకాల పరిశీలన



పాఠ్య పుస్తకాలను పరిశీలిస్తున్న విద్య కమిషనర్ సురేష్‌కుమార్

భీమునిపట్నం: మండలంలో ప్రభుత్వ పాఠశాలలకు సరఫరా చేయవలసిన పాఠ్య పుస్తకాలను సోమవారం రాష్ట్ర పాఠశాలల విద్య కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ పరిశీలించారు. ఇక్కడ ఉన్న స్టాక్ పాయింట్‌లో ఏమేరకు పుస్తకాలు ఉన్నాయి, విద్యార్థులకు సరిపడా వచ్చాయా లేదా అని పరిశీలించారు. విద్యార్థులకు అందజేయవలసిన జగనన్న విద్య దీవెన (జేవీడీ) కిట్లు ఏమేరకు ఉన్నాయో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభం కాగానే విద్యార్థులందరికీ పుస్తకాలు, జేడీకీ కిట్లను కచ్చితంగా అందేవిధంగా చర్యలను తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జీ రీజినల్ జాయింట్ డైరెక్టర్ లింగేశ్వరరెడ్డి, మండల విద్యశాఖ అధికారి బాలామణి పాల్గొన్నారు.

## శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం



వేసవి శిబిరాన్ని ప్రారంభిస్తున్న సూరిబాబు

ఆనందపురం: స్థానిక శాఖా గ్రంథాలయంలో సోమవారం వేసవి శిక్షణ శిబిరాన్ని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు చందక సూరిబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ పుస్తకాలు, దినపత్రికలు చదవడం వల్ల జ్ఞానం పెరుగుతుందన్నారు. అనంతరం కొట్యాడ సత్యమూర్తి ఆర్థిక సాయంతో విద్యార్థులకు స్నాక్స్ పంపిణీ చేశారు. రెడ్డిబాబు, చందక అప్పలనాయుడు, అంజనీకుమారి,మ్యాజిక్‌బస్ ప్రతినిధి రమణమ్మ, అంగన్‌వాడీ నిర్వాహకురాలు కాసులమ్మ, గ్రంథాలయఅధికారి అప్పారావు పాల్గొన్నారు.

### వాంబే కాలనీలో ఉచిత వైద్యశిబిరం



పరీక్షలు చేస్తున్న వైద్యులు

మధురవాడ: జీవీఎంసీ 7 వార్డు వాంబే కాలనీ సచివాలయం ఆవరణలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గీతం డెంటల్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరాన్ని వైఎస్సార్ సీపీ 7వ వార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు ప్రారంభించారు. వాంబేకాలనీతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన పలువురికి వైద్యసేవలందించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ప్రొఫెసర్ నవీన్, రాజా మల్లేష్, పి. సాయిసౌజన్య, అమీషా రాణి, వైఎస్సార్‌సీపీ నాయకులు రామిరెడ్డి, ఎల్లాజీ తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధుడి ఆత్మహత్య



మహేశ్వరరావు మృతదేహం

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు చేపలుప్పాడ పరిధి చేపలదిబ్బడపాలెంలో ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చేపలదిబ్బడపాలెంలో నివాసం ఉంటున్న బత్తిన మహేశ్వరరావు (60) సోమవారం తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. మహేశ్వరరావుకు ఒక కొడుకు, కూతురు. కూతురుకు పెళ్లికాగా, కొడుకు రాజమండ్రిలో ఉద్యోగం చేస్తున్నాడు.బంధువుల ఫిర్యాదు మేరకు భీమిలి ఎస్ఐ భరత్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## 138 మంది రైతులకు ఆర్‌సీ ప్లాట్లు



రైతులకు జెరాక్స్ ఎల్‌పీవోసీలు పంపిణీ చేస్తున్న ల్యాండ్ పూలింగ్ అధికారి వెంకటేశ్వరరావు

పద్మనాభం: నేరేళ్లవలస లేఅవుట్‌లో జగనన్న పట్టణ గృహ పథకానికి ల్యాండ్ పూలింగ్‌లో భూములిచ్చిన 138 మంది రైతులకు ఆర్‌సీ ప్లాట్లు కేటాయించినట్టు ల్యాండ్ పూలింగ్ అధికారి వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ ప్లాట్లు చెందిన రైతులు 91 మందికి మండలంలోని నరసాపురంలో సోమవారం జెరాక్స్ ఎల్‌పీవోసీలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నరసాపురానికి చెందిన 95 మందికి, నేరేళ్లవలసకు చెందిన 22 మందికి, గంధవరానికి చెందిన 15 మందికి, రెడ్డిపల్లికి చెందిన ఇద్దరికి, తునివలసకు చెందిన నలుగురికి ప్లాట్లు కేటాయించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు సుంకర గిరిబాబు, తహసీల్దార్ తోట శ్రీవల్లి, వైఎస్సార్ సీపీ నాయుడు సుంకర బంగారప్పడు పాల్గొన్నారు.

## బోరు నిర్మాణానికి భూమి పూజ



బోరు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు గిరిబాబు

పద్మనాభం: మండలంలోని కొత్తకొవ్వాడ ఎస్సీ కాలనీలో జెడ్పీటీసీ సభ్యుడు సుంకర గిరిబాబు తన సొంత నిధులు రూ.55వేలతో బోరు నిర్మించేందుకు సోమవారం భూమి పూజ చేశారు. నాలుగేళ్ల నుంచి ఈ కాలనీలో ఉన్న 150 కుటుంబాలు నీటి ఎద్దడితో బాధపడుతున్నాయి. దీంతో జెడ్పీటీసీ గిరిబాబు తన సొంత నిధులతో బోరు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు, సర్పంచ్ పొన్నకాయల రత్నం, వైఎస్సార్ సీపీ నాయకుడు కోన వెంకట బాల సింహాచలం పాల్గొన్నారు.

## ‘స్పందన’కు ఎనిమిది వినతులు



వినతులు స్వీకరిస్తున్న జెడ్సీ రాము

భీమునిపట్నం: స్థానిక జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము ఎనిమిది వినతులు స్వీకరించారు. ఇందులో ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి ఐదు, పట్టణ ప్రణాళిక విభాగం రెండు, రెవెన్యూ విభాగానికి సంబంధించి ఒక వినతి వచ్చింది. వీటిని వెంటనే పరిష్కరించే విధంగా చర్యలను తీసుకుంటానని జెడ్సీ తెలిపారు.

**సీతారామరాజు విగ్రహం పరిసరాలు శుభ్రంగా ఉంచండి**

మధురవాడ: జీవీఎంసీ 7వ వార్డు స్వతంత్రనగర్ ఏఎస్ఆర్ నగర్‌లోని అల్లూరి సీతారామరాజు విగ్రహం పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు చేపట్టాలని సీపీఐ జిల్లా సమితి సభ్యురాలు ఎండీ బేగం, వాండ్రాసి సత్యనారాయణ, వేలంగిణి రావుకోరారు. సోమవారం మధురవాడ జోనల్ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో జెడ్సీ కె.కనకమహాలక్ష్మి వినతులు స్వీకరించారు. జోనల్ పరిధిలోని 9 వార్డుల్లోని వివిధ ప్రాంతాల నుంచి పలు సమస్యలపై 9 అర్జీలు వచ్చాయి. వృద్ధాప్య పింఛన్ కోసం మధురవాడకు చెందిన ఎస్.అప్పలకొండ, వితంతు ఫింఛన్ కోసం గుణుపూరు లక్ష్మి వినతి పత్రాలు ఇచ్చారు. పరదేశిపాలెం సర్వే నంబరు. 52/6లో తన భూమిలోకి వచ్చే విధంగా పక్కనే ఉన్న సర్వే నంబరు 52/2లో భూమికి చెందిన వారు భవనం నిర్మిస్తున్నారని, చర్యలు చేపట్టాలని జి. రవి కుమార్ ఫిర్యాదు చేశారు. పందులను నియంత్రించాలని కొల్లా వెంకటేష్ కోరారు.

## జిల్లా నాగవంశం జాయింట్ కమిటీ ఏర్పాటు



కొత్తగా ఎన్నికైన విశాఖ జిల్లా నాగవంశం జాయింట్ కమిటీ

పద్మనాభం: స్థానిక కుంతీ మాధవ స్వామి ఆలయంలో సోమవారం రాత్రి 33 మందితో విశాఖ జిల్లా నాగవంశం జాయింట్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో పద్మనాభం ఎంపీపీ కంటుబోతు రాంబాబు, భీమునిపట్నం జెడ్పీటీసీ సభ్యుడు గాదు వెంకటప్పడు, బీజేపీ భీమిలి నియోజకవర్గం కో-ఆర్డినేటర్ కంటుభుక్త రామానాయుడు, వైఎస్సార్‌సీపీకి చెందిన బొద్దు అప్పలనాయుడు తదితరులున్నారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ బీసీ-డిలో ఉన్న నాగవంశం కులాన్ని బీసీ-ఎ లోకి తీసుకు రావడానికి ఐక్యంగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాంభుక్త కన్నారావు, లింగిబోతు జనార్ధన్ పాల్గొన్నారు.

# కొండవాలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



సత్యసాయినగర్‌లో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, కార్పొరేటర్ కంపా హనోకు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు, భీమిలి నియోజకవర్గ పరిధిలోని కొండవాలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు సోమవారం శ్రీకారం చుట్టారు. సత్యసాయినగర్, వరాహగిరి ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కంపా హనోకుతో కలిసి భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. ఈ పనుల నిమిత్తం రూ.20 లక్షల నిధులు మంజూరైనట్లు జీవీఎంసీ సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ, కాలనీ అధ్యక్షుడు కారు కొండ రాజు, ఎల్.రవిశంకర్, కె.కనకరాజు, వాసుపల్లి యల్లాజీ రావు, మడక పైడిబాబు, పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది, ఆర్పీలు, వలంటీర్లు పాల్గొన్నారు.

**సామాజిక భవనం ప్రారంభం**

వార్డులోని సింగాలమ్మపురంలో రూ.26.50 లక్షల జీవీఎంసీ నిధులతో పునర్నిర్మించిన సామాజిక భవనాన్ని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, కంపా హనోకులు కాలనీ అధ్యక్షుడు చింతల బాబూరావుతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో జీవీఎంసీ జోన్-5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ, ఏఈ రమణమ్మ, సీవో లక్ష్మి, పార్టీ నాయకులు సన్యాసప్పలనాయుడు, నేపాల్ శ్రీను, సన్ని, నానిబాబు, నూకరత్నం తదితరులు పాల్గొన్నారు.

**సింగాలమ్మపురంలో ‘గడప గడపకు..’**

సింగాలమ్మపురంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ఆశీర్వదించాలని కోరారు.